అంతా గూటికి చేరారు!

ఇరవై ఆరో నెంబరు బస్సు సింహాచలం నుంచి బయలుదేరి గోపాలపట్నం, మర్రిపాలెం మీదుగా మాంచి హుషారుగా జోరుగా వచ్చి 104 బస్సుస్టాండ్ దగ్గర ఆగింది. అప్పుడు బాస్కెట్ బాలంత ఉన్న ఎర్రని సూర్యుడు ఆటలో ఓడిపోయిన వాడిలా కృంగిపోతూ కనుమరుగైపోతున్నాడు.

అప్పుడే నిండు యవ్వనంతో పంచదార కలశంలా చవులూరించే మచ్చలేని మామిడిపండుచిన్నది, తెల్లని నవ్వుల పలువరుసతో సన్నని చిక్కని కాటుక కన్నులతో బస్సు ఎక్కుతూ 'ఒరేయ్! ఫోను చెయ్యడం మరచిపోకు. టాక్సీలూ దొరకలేదు, ఆటోలూ దొరకలేదని చెప్పు. చిన వాల్తేరుకు మనిషిని పంపమనీ చెప్పు. మరచి పోకు' అంటూ కంఠం శ్రావ్యంగా వీణకన్న మధురంగా మోగించింది. అందరి చూపులూ అటు తిరిగాయి.

అడ్డుగాఉన్న జనం అటే చూశారు. తమకు అడ్డుగా ఉన్న వాళ్ళను తిట్టుకుంటూ కనబడని ఆ జవ్వనిని చూసేందుకు వీలు చిక్కని చాలా మంది మనసులో చికాకు పడిపోయారు. ఒక్కసారైనా చూడకపోతే ఎలా అనుకున్నారు.

జనం ఆవిడకు సులువుగా దారి ఇచ్చేశారు. బహుశా ఆమె చేతి వజ్రాల గాజుల మహిమో... ఖరీదైన ఎలక్ట్రానిక్ రేడియమ్ డయల్ రిష్టువాచీమహిమో... వాళ్ళ ఇళ్ళకు 'ఇందిరమ్మ' వచ్చినట్లు మూర్ఛపోతూ వెనక్కి వెనక్కి తగ్గిపోయారు. దారి సులభం చేశారు.

రెండో సీట్లో ఉన్న ఇద్దరిలో ఓ ముసలమ్మ పోతూ పోతూ 'ఇలా కూకో తల్లీ...' అంటూ లాలనగా ముద్దుగా అప్పుడే వచ్చిన వారికి ఎప్పటికీ దొరకని సీటు చప్పున ఇచ్చేసి తను ఏదో గొప్ప సహాయం చేసినట్లు మహా ఇదైపోయి దిగిపోయింది. గొప్పవాళ్ళకు సహాయం చేశాం అన్న మహగొప్ప ఆనందమేదో ఆమె కంటిలో మెరిసింది. 'ఇందిర' కే వోటు వేసినట్లు మహా సంబరపడిపోయింది.

కళ్ళల్లో చిలక నవ్వులు మెరిపిస్తూ పక్కనున్న ఆవిడ ఎలాంటి ఆవిడో ఒకసారి పరిశీలించి చూసుకొని, తన వెనుక మగవాళ్ళున్నట్టు అంతకుముందే గ్రహించి, తనముందు స్త్రీలే కూర్చున్నట్లు తెలుస్తూనే ఉన్న విషయం మనసులోనే నిలుపుకొని, 'ఛి..ఛీ సమయానికి కారు చెడిపోయింది' అని గుంజాటన పడుతూ చాతకాని డ్రైవర్ను తిట్టుకుంటూ, పరమేశ్వరి సినిమా హాలు దగ్గర వాల్ పోస్టర్లో ఎన్.టి.ఆర్.ను చూసి 'నిత్య యవ్వనుడు, ఇంకా ఎంత హుషారు' అనుకొని తమలపాకు సేవించిన పెదవుల్లోంచి పైకుబికిన సుకుమారమైన నవ్వుల వెన్నెలల్ని ముఖాన వెలిగించింది. ఆ ముసలమ్మ ఇచ్చిన సీటు ఇంకా తగ్గని వెచ్చదనానికి సహించలేని లక్షణమేదో ఆమె ముఖంలో విలవిల తన్నుకుంది. మెడలోని హారాలు, చీరలోని జరీ పువ్వుల విలువలు అక్కడ ఆ బస్సులో ఆమెను కూర్చోనివ్వడం లేదు. లక్షలు విలువచేసే చెవుల సౌందర్యం, అంతకు రెట్టింపు విలువుండే ఆ లోలకుల నాజూకు పనితనం కళ్ళముందు మెరిసిపోతూ ఉంటే తనలోంచి వెల్లువలై ప్రవహిస్తూ, ఆ బస్సులో పేరుకుపోయిన కుళ్ళు కంపును తుడిచేసి ఫ్రెష్గా అందరికీ అమృతపు జల్లులా సువాసనల నందించిన తన ఉడుపుల్లోంచి పెల్లుబికే సుగంధ పరిమళం ఆ బస్సుకు ప్రాణం పోసినందుకు మహదానందపడిపోయింది. తనలోంచి ఏదో వెలుతురు వాళ్ళ ముఖాలమీద పడి వెలిగించినట్లు భావించింది.

బస్సు ఆగుతూ కదులుతూ ఉంది. జనం ఎక్కుతూ దిగుతూ ఉన్నారు. సినిమాల వేళ దాటిపోవడంవల్ల బస్సు మరీ ఇరకాటంగా లేదు. చాలామంది దిగిపోవడమేకాని ఎక్కేవాళ్ళు పల్చబడిపోయారు.

నవరత్నాలను బుల్లి బుల్లి ముత్యాలగుత్తుల మధ్య పొదిగిన ఆ సొగసు లోలకుల్ని ఒకరు చూస్తూవుంటే, ఒకరు ఆమె చేతి గడియారంవైపే చూస్తున్నారు. ఒకరు ఆ చీర సౌందర్యానికిముచ్చటపడిపోతూ ఉంటే, ఒకరు కాళ్ళపాంజేబు పట్టాల్లోని పనితనం, సొగసులకు ముచ్చటపడిపోతున్నారు. పైపైకి తేలి కనిపించే ఆ చీరలోని లంగా తళత్తళలకు కొందరు మోజుపడుతూ ఆ వజ్రాలగాజులమీద నిలబడిపోతున్నారు.

ఆ అందం ముందు ఏ సినీ హీరోయినైనా బలాదూరే అంటూ కొద్దిమంది మాత్రం ఆమె ముఖం చూడగలిగే అదృష్టవంతులు ఉక్కిరిబిక్కిరైపోతున్నారు. ఆచెంపల సౌకుమార్యానికి జ్వాలలా సూదంటురాయిలా లాగుకుంటూ గుండెల్ని మత్తెక్కించేస్తూవుంటే, అటు చూడగలిగిన అదృష్టవంతులు ఉక్కిరిబిక్కిరైపోతున్నారు. వెనుకనున్నవారు జుత్తు ముడి, మెడ సొగసు చూస్తూ బెంగపడిపోతున్నారు.

ఈలోగా దుర్గాలమ్మ గుడి రానే వచ్చింది. అంటే బస్సు పూర్ణా మార్కెట్‌కు వచ్చిందన్నమాట. మూడువంతులు దిగిపోయారు. అంతకు రెట్టింపు ఎక్కారు. ఈసారి బస్సు కొంచెం సందడిగానే ఉంది.

ఏవేవో మాటల కలయికల, 'ధ్వని తరంగాలు' ఆమెకు చికాకు కలిగిస్తూనే ఉన్నాయి. ఇంతసేపూ డబ్బులడగడం మరిచిపోయిన కండక్టర్ టికెట్....టికెట్ అంటూ ఆమె ముందు నిలిచాడు.

గుండెల్ని పిండేసే హ్యాండ్‌బ్యాగ్ జిప్ సర్‌నలాగి కొత్తపదిరూపాయల కాగితం చివర అంచు కండక్టరు చేతికందించింది. మనిషెంత గొప్పగా ఉందో ఈ నోటూ అంత గొప్పగా ఉందనుకుంటూ ఉన్నవాటిల్లో మంచినోట్ల కోసం వెదికి వెదికి చివరికి నలిగిపోయిన కుళ్ళునోట్లు చిల్లరతోసహా చేతిలో పెట్టాడు.

ఆమె లెక్క చూసుకుంది. 'ఛీ... తను లెక్కపెట్టుకోవడమేమిటీ...' అనుకుంది. నలిగిపోయిన అయిదురూపాయలనోటూ, వడలిపోయిన ఆకుల్లాంటి రెండు రూపాయలనోట్లూ, పదిపైసల బిళ్ళా, అయిదు పైసల బిళ్ళా ఉన్నాయి. కాదు... ఉన్నట్లు ఆ కళ్ళు చూశాయి. పైటసర్దుకుంది. మళ్ళీ చూసింది. అలాగే అనిపించింది. ఆ డబ్బు చేతిలో ఉంచినప్పుడు ఆ చేతి లావణ్యానికి కండక్టర్ తూలిపడబోయాడు. వెంటనే ఆమె అతని గుండెలాగిపోయేటట్టు 'వన్ నాట్ ఫోర్ నుండి చినవాల్తేరుకు ఎంత?' అంది.

కళవర పడ్డ కండక్టరు 'అరవైపైసలండీ' అన్నాడు.

'మరి చిల్లరెంత ఇచ్చావు' మామూలుగానే అంది. ఈమాటతో బస్సులోని వారంతా ఎలర్ట్ అయిపోయారు.

'తొమ్మిది రూపాయల నలభైపైసలిచ్చాను. ఓ అయిదురూపాయల నోటు, రెండురెళ్ళూ, ఓపావలా, పదిపైసల బిళ్ళ ఒకటీ,ఐదు పైసల బిళ్ళ ఒకటీ..,' అన్నాడు.

మళ్ళీ ఓసారి అతనిచ్చిని డబ్బు లెక్క చూసింది. 'ఓ పావలా తక్కువుందే' అంది.

వెంటనే ఆమె ప్రక్కనే కూర్చున్న విధవరాలు 'వీళ్ళంతేనండీ... పావలాలు, అయిదుపైసలబిళ్ళలూ కొట్టేస్తూ ఉంటారండి' అంది.

కండక్టరుకు రాగూడని కోపం వచ్చేసింది. 'మాటలు సరిగ్గా రానివ్వండి, కొట్టెయ్యడం గిట్టెయ్యడం మనకు తెలియదు. ఎక్కడ పడిపోయిందో సరిగా చూసుకుంటే..... మీకే.... అని అతనింకా ఆ మాట పూర్తి చేయకముందే.–

'ఏమిటోయ్.. ఫూల్‌లా.... ఆవిడ ఆఫీసరుగారి భార్య. ఇవ్వలేదంటూఉంటే....

నోటికొచ్చినట్లు వాగుతున్నావ్..... సరిగా చూడమంటావేమిటి? ఆమెకు లెక్కలు రావనా...ముందు ఇచ్చెయ్ పావలా.....' అన్నాడు ఆమె పక్కనే నిలచి ఆమెలోంచి బంగారమేదో తనలోకి పాకిపోతున్నట్టు మహ సంతోషపడిపోతూన్న ఆ పెద్దమనిషి. ఆమెకు ఘోరమైన అన్యాయం జరిగిపోయినట్లు హడావుడైపోయాడు.

వెంటనే మరొకడు 'నేను చూస్తూనే ఉన్నాను. ఆమె లేచి చీర దులుపుకోవడం... పైటసర్దుకోవడం... ఎక్కడా పడందే... పాపం ఆవిడ వంగి కాళ్ళ కిందకూడ చూసుకుంది' అంటూ గట్టిగా అరిచాడు ఓ చూపుల గుంటడు.

కండక్టరుకు పిచ్చెక్కినట్లయింది. 'ఆమె కాళ్ళకింద చూసుకుంటే నాకెందుకూ, చీర దులుపుకుంటే నాకెందుకు. నేనిచ్చాను. ఎవడమ్మ మొగుడిసొమ్ము తేను, మీరంతా పారేసుకుంటూవుంటే తీసుకొచ్చి ఇవ్వడానికి' అనేశాడు కాస్త రఫియన్‌లా.

దీనితో ప్రజలు కుతకుత సున్నంలా ఉడికిపోయారు. 'ఆపు ముందు బస్సు. నీ దగ్గరున్న డబ్బు లెక్కపెట్టు ఇచ్చిందీ లేందీ తేలిపోద్ది' అన్నాడు ఓ హీరో సర్న ముందుకొచ్చి.

'ఇలా అందరికోసం పైస పైసకు లెక్కపెట్టుకుంటూ కూచుంటే మరి బస్సు కదలినట్లే' అన్నాడు కండక్టరు ధీమాగా.

'అయితే ఎవడబ్బ సొమ్ము దొబ్బుతావ్.. ఆపు బస్సు' అన్నాడు కత్తిలా ఓ తాగుబోతు.

'నా జన్మలో ఒక్కసారి కూడ ఎవ్వరికీ నే డబ్బు తక్కువివ్వలేదు. అలా ఎప్పుడూ జరగదు' అన్నాడు కండక్టరు ఉక్రోషంతో.

ఈ మాటలు అలా అలా క్షణం క్షణం బస్సు చక్రాల్లాచుట్టుకుంటూ ముందుకు పోతుంటే హోరా హోరీ యుద్ధం జరిగిపోయే స్థితికి వచ్చేసింది.

జగదాంబ దాటి, రామ్‌నగర్ గవర్నర్ బంగళాదాటి బస్సు సిరిపురం వచ్చేసింది. ఆస్టాప్ దగ్గర బండి ఆగుతూ ఉండగా -

'అంతా దిగండి, ఊ... తొందరగా దిగిపోండి, బస్సెలా కదులుతుందో చూస్తాను. పావలా ఇవ్వడమో చావడమో ఇవ్వాళ తేలిపోవాల. లేకపోతే ఇక్కడి కిక్కడే బస్సు తుర తుర తగలడిపోద్ది.... దిగండి ముందు...' అంటూ ప్రళయంగా అరిచాడు ఓ వీర కిశోరం.

ఓ పది మంది అతనితో దిగారు. బస్సు కడ్డంగా ప్రాణాలకు తెగించినట్లు నిలబడిపోయారు. డ్రైవరు ఇంజను ఆపివేశాడు.

ఆ మూల బస్సులో కెవ్వున అరుపులు. ఏవేవో రణగొణ ధ్వనులు, ఆర్భాటాలు, ఆలస్యమైపోతోందని ఇళ్ళదగ్గర తమకోసం ఎదురుచూస్తూ పిల్లలు ఏడుస్తూ ఉంటారని మరో మూల కాకిగోల. అంతా ఎవరికి వారు వాళ్ళకు తోచినట్లు ప్రపంచం అంతాయుద్ధంలో మునిగిపోయినట్టు, బలం కొద్దీ మాటల బాంబులు విసురుతున్నారు.

ఏమి జరుగుతుందో ఏమీ తెలియడం లేదు. వాళ్ళ హడావుడి చూస్తూ ఉంటే యూనివర్సిటీ ముందే బస్సుని తగలేసేలా ఉన్నారు.

ఆ వీరావేశం ఎక్కడినుంచి ఎలా పుట్టుకొచ్చింది? అందరిలోనూ కొంపలు మునిగిపోయే ఆవేశం పెరిగిపోయి రెచ్చిపోయి సివాలేస్తోంది.

ఉధృతంగా సైనికుల అరుపులు, వికృతంగా భరించనలవికాని మృగాల కూతలు బస్సును చుట్టుముట్టేశాయి.

ఆమె మళ్ళీ ఏమీ మాట్లాడలేదు. బిక్కసచ్చినట్టు ఊరుకుంది. కొడుకు చచ్చిపోయినప్పుడు ఇందిరాగాంధీలా బిగుసుకుపోయింది.

'దిగిపోదాం రండి వాడు డబ్బు లెక్కబెట్టడు. వీళ్ళు బస్సు తగలెట్టడం మానరు' అంది పక్కనున్న విధవరాలు.

'దిగిపోవాలా' అన్నట్టుగా లేచిందావిడ 'మరి తప్పదా' అన్నట్టు బెంగటిల్లి పోయింది.

'పోనీలెండి... ఎందుకు ఓ పావలా కోసం ఇంత రభస' అనాలని కూడా అనలేక పోయింది. సుదీర్ఘంగా ఆలోచనలో పడిపోయినట్లుంది, వారసుని కోసం దిగులుపడిపోతూన్న ప్రధానిలా.

అప్పుడు ఆ ప్రక్క; క్రింద కూర్చున్న, బస్సులో నిలబడి దాని ఊపులకు తట్టుకోలేని ముసలివాడు, ఆకారంలో బిచ్చగాడిలా ఉన్నవాడు 'ఎందుకయ్యా పావలా కోసం అలా చచ్చిపోతారు. ఇదిగో ఇక్కడుంది తీసుకోండి' అన్నాడు.

అంతా చప్పున తుస్సుమనిపోయారు!

'వెధవ-ఇంతవరకు ఎందుకు చెప్పలేదు. చెక్కెయ్యాలనుకొని ఉంటాడు' ఎవరో పైకి అనేశారు.

ముసలివాడు 'నిజం నిలకడమీదకాని తెలియదు బాబూ....' అని తనలో తాను గొణుక్కున్నట్లు అన్నాడు. ఆ మాట ఎవరూ విన్నట్టులేదు. అల్లరి ఇంకా సద్దుమణగలేదు.

ఆ పావలా దొరక్కపోతేమాత్రం ఆవిడగారికోసం, ఆవిడను తృప్తిపరచడం కోసం ఆ బస్సు ప్రాణాలు తోడేసేవారు. కండక్టరును డ్రైవరును మళ్ళీ నీళ్ళు తాగనిచ్చేవారు కాదు.

బస్సు మళ్ళీ కదిలి ఇన్‌గేట్, అవుట్‌గేట్, పోలీసు స్టేషను, పిచ్చాసుపత్రిదాటి బస్సు

చినవాల్తేరు చేరింది.

ఆమెతో పాటు ఆముసలివాడూ దిగాడు.

వంగి చేతికర్ర పుచ్చుకొని మెల్లగా దీనంగా అపనిందను మోస్తూ ఎవరివైపూ చూడకుండా 'అంతా చల్లగా ఇళ్లకు చేరుకున్నారు...చాల్లే....' అని తనలో తాననుకున్నట్లు అనుకున్నాడు. ఈ మాట ఆవిడకు చేరనే చేరింది.

ఫోను అందుకుని వచ్చిన పనిమనిషి తోడురాగా కదిలి, గబాగబా బాత్ రూమ్‌కుపోయి ఆ చీర జాకెట్టు లంగా బ్రా ఊడదీసి ఓ మూలకు విసిరేసింది.

అప్పుడు టక్‌మని ఏదో ధ్వని -

రైళ్ళు గుద్దుకున్నట్టు, విమానం కూలిపోయినట్టు

చూస్తే పావలా!

తను దిగంబరంగా ఉంది.

షవర్‌లోంచి నీళ్ళు ఒళ్ళంతా సర్‌సర్‌న ఎడతెరపి లేకుండా ఆక్రమిస్తున్నాయి.

'పాపం కండక్టర్... ' అనుకుంది.

తల్లడిల్లిపోయింది.

జాకెట్‌కు, బ్రాకు మధ్య ఎలా పడిందో....?

ఇంతకీ ఆ ముసలివాడు తన స్వంత డబ్బు దానం చేశాడా? పేదవాడు... అంత తెలివున్నట్టు కనబడనివాడు... వాడికి ఇంత గొప్ప ఆలోచన ఎలా పుట్టింది? అతను ఇవ్వకపోతే ఘోరాతిఘోరం జరిగిపోయేది.

'అంతా చల్లగా ఇళ్ళకు చేరుకున్నారు....చాల్లే....' అన్న అతని ఆ మాటలు గుండెల్ని చిదిమేస్తున్నాయి.

ఉదయం తన భర్త ఒక వంద రూపాయలు తక్కువ ఉన్నాయి. మరోసారి ఇస్తానంటున్నా అయిదువందలకు తక్కువైతే పనిచెయ్యనని తిప్పికొట్టిన సంగతి ఆమెను కుళ్లబొడిచేసింది. అందులో అది లంచం. ఈ నగలు ఈ రవ్వల గాజులు, ఈ లోలకులు, ఈ బ్రా, ఈ జాకెట్టు అన్నీ ఆ లంచాల బాపతే! కాని తను పావలా దొరికింది అని అనలేకపోయింది.

ఈ చీర, ఈ దుస్తులు అన్నీ... అన్నీ దుర్గంధంతో నిండిపోయినట్లున్నాయి. ఓ పావలాయేగా అనుకోలేకపోయింది తను. ఉదార బుద్ధి ఈ రక్తంలో ఏడ్చి చావలేదు.

ఈడబ్బురూపంలో ఈ లోకం ముందు ఎంత గొప్పగా ఈక్షణంలో తను నిలిచిపోయింది!

ఎలాంటి వారికైనా ఓ రోజుంటుందట! తను కుళ్ళి కుళ్ళి ఛస్తున్న రోజు ఇది.

పాపం! ఆ ముసలి వాడు అంతటి ఉదారుడు, మానవత్వం రూపు దాల్చినవాడు నిందను నెత్తిన వేసుకొని వెళ్ళిపోయాడు.

"అంతా చల్లగా ఇళ్ళకు చేరుకున్నారు. చాల్లే....." ఆ పేదవాని గుండెల్లో ఎలా పుట్టుకొచ్చింది ఆ దయాదేవత! మళ్ళీ మళ్ళీ ఆ మాటలే గుండెల్లో కలియ తిరుగుతున్నాయి.

ఆమె కళ్ళల్లో నీళ్ళు....కాదు.....కాదు, పైనుంచి జారుతున్న షవర్ కన్నీళ్ళు పాపం!

ఇందాక పడమట అస్తమించిన ముసలి సూర్యుడు, అతగాడి ఓడిపోయి కమిలిపోయిన ముఖం, ఆమె కళ్లముందు భయంకరంగా నిలిపి, ఆమె గుండెకాయను ఒలుచుకొని నోట కరచుకొని గెద్దలా మాయమైపోయాడు.

(భారతి, మార్చి 1981)